క్లుప్తంగా

ఫీజు పోరు వాయిదా

పెదపూడి: విద్యార్థులకు వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలని కోరుతూ ఈనెల 4న నిర్వహించే ఫీజు పోరు కార్యక్రమం మార్చి 12వ తేదీకి వాయిదా వేశారని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి తెలిపారు. ఆయన మంగళవారం అనపర్తి పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ రాష్ట్రంలో మెజార్టీ జిల్లాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారన్నారు. ఎన్నికల కోడ్ అమలవుతున్న నేపథ్యంలో ఫీజు పోరు కార్యక్రమానికి అనుమతి ఇవ్వాలని కోరినా ఎన్నికల సంఘం నుంచి ఏలాంటి స్పందన రాలేదన్నారు. దీంతో కార్యక్రమం వాయిదా వేశారన్నారన్నారు.

కుమార సుబ్రహ్మణేశ్వరస్వామికి అభిషేకాలు


బిక్కవోలులో ప్రత్యేక అలంకరణలో కుమార సుబ్రహ్మణేశ్వరస్వామి

బిక్కవోలు: స్థానిక కుమార సుబ్రహ్మణేశ్వరస్వామి ఆలయం వద్ద మంగళవారం అభిషేకాలు నిర్వహించారు. మంగళవారం మాఘ మాసం షష్టి కలిసిరావడంతో అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అభిషేకాలు చేశారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేశారు. దేవాదాయశాఖ ఆధ్వర్యంలో వచ్చిన భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయం ఈవో రామలింగ భాస్కర్, సిబ్బంది ప్రసాద్, రవి, సత్తి బాబు పాల్గొన్నారు.

డాక్టర్ గన్నికి సీఎస్ఆర్ హీరోస్ అవార్డు


సీఎస్ఆర్ హీరోస్ అవార్డు అందుకుంటున్న డాక్టర్ గన్ని

రాజానగరం: కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్)లో భాగంగా వృత్తిపరంగా విశిష్టమైన సేవలందించినందుకు స్థానిక జీఎస్ఎల్ వైద్య కళాశాల చీఫ్ మెంటార్ డాక్టర్ భాస్కరరావు సీఎస్ఆర్ హీరోస్ - 2025 అవార్డును అందుకున్నారు. నవభారత్ టైమ్స్ ఆధ్వర్యంలో మంగళవారం ముంబయిలో నిర్వహించిన నాల్గవ నవభారత్ సీఎస్ఆర్ సమ్మేళనంలో ఈ అవార్డును మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ చేతుల మీదుగా డాక్టర్ గన్ని అందుకున్నారు. ఈ విధంగా దేశంలో వేర్వేరు రంగాల్లో సేవలందించిన 33 మంది ఈ అవార్డులు అందుకున్నారని కళాశాల డైరెక్టర్ పెద్దాడ నవీన్ తెలిపారు.

మహిళలకు చీరల పంపిణీ


బూరుగుపూడి మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న బొబ్బా వీరా స్వామినాథం దంపతులు

మధురపూడి: కోరుకొండ మండలం బూరుగుపూడి బాబా మందిరంలో బొబ్బా కోటాదేవి జ్ఞాపకార్థం ఆమె కుటుంబ సభ్యులు మంగళవారం రథసప్తమి సందర్భంగా ఆలయంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న మహిళలు, వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. బొబ్బా వీరాస్వామినాథం, ఆయన సతీమణి దుర్గాకుమారి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మందిరంగురువు మామిడిపల్లి రామారావు, అధ్యక్షుడు కంటే నాగేశవరావు, సభ్యులు కంటే సత్యచక్రగణపతి, గూడపాటి పెద్ద తదితరులు పాల్గొన్నారు.

పిల్లల ఎదుగుదలకు పౌష్టికాహారం దోహదం


అంగన్‌వాడీల సమావేశంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీవో జెస్సీ ఫ్లోరెన్స్

బిక్కవోలు: పిల్లల బరువులు సక్రమంగా చూడాలని రంగంపేట ప్రాజెక్ట్ ఐసీడీఎస్ సీడీపీవో జెస్సీ ఫ్లోరెన్స్ అన్నారు. మంగళవారం మండలంలోని బిక్కవోలులోని అంగన్‌వాడీ కార్యకర్తలతో సీడీపీవో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లల ఎత్తు, బరువు సక్రమంగా ఉంటేనే వారి ఎదుగుదల సక్రమంగా ఉంటుందన్నారు. గర్భిణులు, బాలింతలకు ఇంటికి వెళ్లి ఐసీడీఎస్ ద్వారా అందించిన పౌష్టికాహారం తీసుకుంటున్నారా లేదా పరిశీలించాలన్నారు. యాప్‌లో చిన్నారుల వివరాల నమోదు చేయడానికి ఆధార్ అవసరమని తెలిపారు. చిన్నారులకు ఆధార్ కార్డు నమోదు చేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలోని ఐసీడీఎస్ సూపర్‌వైజర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

కన్నుల పండువగా రథోత్సవం


జి.మామిడాడలో సూర్యదేవుని రథోత్సవాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం


జి.మామిడాడలోని సూర్యదేవున్ని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి. ఆదిలక్ష్మి దంపతులు

- మార్మోగిన సూర్యనారాయణ నామస్మరణ
- జి.మామిడాడలో ఘనంగా రథసప్తమి ఉత్సవాలు


ఆకట్టుకున్న డప్పుల నృత్యం

పెదపూడి: సూర్యనారాయణ స్వామి నామస్మరణతో జి.మామిడాడ గ్రామం మంగళవారం మార్మోగింది. గ్రామంలో ప్రసిద్ధి చెందిన సూర్యనారాయణ మూర్తి స్వామి జయంతి, రథసప్తమి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని ఆలయంలో వేల సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. మధ్యాహ్నం 1.30 గంటలకు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆయన సతీమణి మహాలక్ష్మి దంపతులు రథోత్సవాన్ని ప్రారంభించారు. అనంతరం రథోత్సవం కనుల పండుగగా సాగింది. ప్రత్యేక డప్పులు వాయిద్యాలు, చిన్నారులు, బాలురు, బాలికలతో ప్రదర్శించిన కోలాటం అందరినీ ఆకట్టుకుంది. స్వామివారిని దర్శించుకోడానికి ఆలయం వద్ద భక్తులు బారులు తీరారు. సూర్యదేవుడికి ప్రీతికరమైన పొంగలిని భక్తులు తయారు చేసి నైవేద్యంగా అర్పించారు. ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తులకు పాలు, బిస్కెట్లు, తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఆధ్యాత్మిక భావాలను అలవర్చుకోవాలి

ఆధ్యాత్మిక భావాలను అందరూ అలవర్చుకోవాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. రథసప్తమి సందర్భంగా స్వామివారిని మాజీ ఎమ్మెల్యే ఆయన సతీమణి ఆదిలక్ష్మి దంపతులు దర్శించుకున్నారు. ఆలయ కమిటీ వారు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆయనకు సాదర స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ద్వారంపూడి పద్మారెడ్డి, పార్టీ మండల కన్వీనర్ గుత్తుల వెంకటరమణ, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు కర్రి శ్రీవెంకటరెడ్డి, పార్టీ గ్రామ కన్వీనర్ ద్వారంపూడి సూర్యనారాయణరెడ్డి, పార్టీ రాష్ట్ర ప్రచార కమిటీ కార్యదర్శి మండ రాజారెడ్డి, హితకారిణి సమాజం మాజీ డైరెక్టర్ వుండ్రు సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎలుకల నివారణ సామూహికంగా చేపట్టాలి


సీతానగరంలో రైతులకు పంపిణీ చేయడానికి ఎలుకల నివారణ మందును సిద్ధం చేస్తున్న దృశ్యం

సీతానగరం: ఎలుకలు వలస వెళ్లే జంతువులని, వరి పంటలో ఎలుకల నివారణకు సామూహికంగా యాజమాన్య పద్ధతులు చేపట్టి, స్థిరమైన దిగుబడులు పొందాలని జిల్లా ముఖ్య వ్యవసాయాధికారి ఎస్ మాధవరావు రైతులకు సూచించారు. మంగళవారం సీతానగరం రైతు సేవా కేంద్రం వద్ద నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయశాఖ ఎలుకల నివారణకు మూకుమ్మడిగా మందు పొట్లాల పంపిణీ కార్యక్రమం చేపట్టిందని తెలిపారు. పచ్చిరొట్ట ఎరువులు, కాల్ సెంటర్ల ప్రాధాన్యతను రైతులకు వివరించారు. జిల్లా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకటనరసింహరావు మాట్లాడుతూ ఎలుకల నివారణకు తీసుకోవాల్సి జాగ్రత్తలను వివరించారు. వరి సాగులో చేపట్టవలసిన యాజమాన్యం విధానాలను ఏడీఏ బీకే మల్లికార్జునరావు వివరించారు.మండల వ్యవసాయాధికారి కె సూర్యరమేష్ మాట్లాడుతూ పసుపు, మిరప, కంది పంటలను వాణిజ్య సరళిలో పండించి ఆర్థిక పరిపుష్టి సాధించాలని రైతులకు సూచించారు. ఏరువాకం కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ నరసింహరావు, జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ ఎస్ జయ రామలక్ష్మి పలు అంశాలు వివరించారు. ప్రస్తుతం వరిలో కాండం తొలిచే పురుగు గుర్తించామని వాటి నివారణకు నాటిన 30 రోజులకు క్యార్బొఫ్యూరాన్ 3జి గుళికలు ఎకరాకు 10 కిలోలు చొప్పున వేయాలని లేదా ఎసీఫేట్ 1.5 గ్రాములు లేదా కోలరిఫైరిఫాస్ 2.5 మిల్లీలీటర్లు మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. కాండం కుళ్లు తెగులు నివారణకు టెబ్యూకోనాజోల్ 2 ఎంఎల్ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. అనంతరం రైతులకు ఎలుకల నివారణ మందు పొట్లాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అగ్రిల్యాబ్ ఏవో రామతులసి, వీఏఏలు రైతులు పాల్గొన్నారు

కొనసాగుతున్న పోలీస్ పికెట్

సీతానగరం: మండలంలోని మిర్తిపాడులో 144 సెక్షన్ అమలు చేస్తూ, పోలీస్ పికెట్ కొనసాగుతోంది. ఈనెల 2న రెండు వర్గాలకు చెందిన కొంతమంది యువకులు ఘర్షణకు దిగి కర్రలతో పరస్పరం దాడులు చేసుకున్నారు. ఈ ఘటనలో గాయాలపాలైన వారు రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇరువర్గాలపై స్థానిక ఎస్సై డి రామ్‌కుమార్ కేసులు నమోదు చేశారు. ఒక వర్గంపై ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదు చేశారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. కోరుకొండ సీఐ సత్యకిషోర్, ఎస్సై రామ్‌కుమార్ ఆధ్వర్యంలో 20 మంది పోలీస్ సిబ్బందితో పోలీస్ పికెట్ నిర్వహిస్తున్నారు. నార్త్‌జోన్ డీఎస్పీ శ్రీకాంత్ ఘటన స్థలాన్ని సందర్శించారు.ప్రస్తుతం గ్రామంలో 144 సెక్షన్ అమలులో ఉంది. ఎప్పటికప్పుడు సీఐ సత్యకిషోర్, సీతానగరం ఎస్సై రామ్ కుమార్ ఘటన ప్రాంతంలో శాంతిభద్రతలను పర్యవేక్షిస్తున్నారు.

ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలి

రాజానగరం: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు ఖరీఫ్ పంటలో రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలని, అలా చేయకుంటే రైతులతో కలిసి ఉద్యమిస్తామని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు అడబాల చినబాబు ప్రభుత్వానికి అల్టిమేటం ఇచ్చారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో రైతులు పండించిన ఖరీఫ్ ధాన్యం నిల్వలు ఎక్కడికక్కడే ఇంకా ఉన్నాయన్నారు. ప్రభుత్వం కొనుగోలు చేస్తుందనే ఆశతో అన్నదాతలు ఎదురుచూస్తుంటే పాలకులు మాత్రం అర్థాంతరంగా కొనుగోళ్లు నిలిపివేశారని ఆరోపించారు. రైతులను ఆదుకుంటామంటూ ప్రగల్భాలు పలికిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చిన తరువాత మోహం చేటేస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని తడి, పొడి అనే తేడా లేకుండా పూర్తిగా కొనుగోలు చేసి, అన్నదాతలకు మేలు చేకూర్చిందని గుర్తు చేశారు. అమలు కాని హామీలతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కూటమి నాయకులు హామీలన్నింటినీ అటకెక్కించి, ఖాజానాలో సొమ్ములేవంటూ కుంటిసాకులతో కాలం వెల్లబుచ్చుతున్నారని విమర్శించారు. అన్నం పెట్టే అన్నదాతలను మోసం చేయడం తగదని, నిలిపివేసిన కొనుగోలు కేంద్రాలను పునఃప్రారంభించాలని డిమాండ్ చేశారు.

ప్రాథమిక దశలో గుర్తిస్తే పూర్తిస్థాయిలో క్యాన్సర్ నివారణ


సంపర పీహెచ్‌సీ వద్ద ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారి శిరీష, సిబ్బంది



మాట్లాడుతున్న డాక్టర్ అనసూరి పద్మలత

పెదపూడి: క్యాన్సర్‌కు అత్యాధునిక వైద్యం అందుబాటులో ఉందని, వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తిస్తే పూర్తిగా నయం చేయవచ్చని సంపర ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి యు.శిరీష అన్నారు. సంపరలో మంగళవారం క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా వైద్య సిబ్బంది, ప్రజలు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తగు జాగ్రత్తలు పాటించి, వైద్యంతోపాటు పౌష్టికాహారం తీసుకుంటే క్యాన్సర్‌ను జయించవచ్చని వివరించారు.వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో క్యాన్సర్‌పై విజయం స్క్రీనింగ్‌తో సాధ్యం అన్నారు. ఇప్పటికే గ్రామాల్లో క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమం నవంబర్ 14 నుంచి ప్రారంభమైందన్నారు. ఇంటి వద్దే 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఆరోగ్య సిబ్బంది ప్రాథమిక క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నారన్నారు. క్యాన్సర్ మహమ్మారిని ఎదుర్కోవాలంటే ముందస్తుగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రాథమిక దశలోనే క్యాన్సర్ కణాలను గుర్తించడం ద్వారా మరణాల సంఖ్యను గణనీయంగా తగ్గించుకోవచ్చన్నారు. ఈ ర్యాలీలో ఎంపీహెచ్‌ఈవో ప్రసాద్, హెచ్‌ఈ విజయలక్ష్మి, ఎస్ఎస్‌లు జోగిరాజు, వీరగనిక, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

జీవనశైలిలో మార్పులతోనే క్యాన్సర్ నివారణ

రాజానగరం: దేశంలో ప్రాణాంతక మహమ్మారిగా తయారైన క్యాన్సర్ వ్యాధిని నివారించేందుకు మానవ జీవనశైలిలో మార్పులు తీసుకురావడం తప్పనిసరి అని జేసీఐ జాతీయ శిక్షకురాలు డాక్టర్ అనసూరి పద్మలత అన్నారు. ప్రపంచ క్యాన్సర్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని తూర్పుగానుగూడెంలోని ఐఎస్‌టీఎస్ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో జేసీఐ రాక్‌స్టార్ ఆధ్వర్యంలో క్యాన్సర్ నివారణపై మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ ప్రతి రోజూ 20 నుంచి 30 నిమిషాలు వ్యాయామం చేయాలని, తాజా ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు ఆహారంగా తీసుకోవాలన్నారు. మద్యం, ధూమపానం అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. ఊబకాయం, అతి నిద్ర, నిద్రలేమి, పోషకాహార లోపాలు, జింక్ ఫుడ్స్, కృత్రిమ రంగులతో తయారైన ఆహార పదార్థాలు క్యాన్సర్‌కి కారకాలుగా పేర్కొన్నారు. కార్యక్రమంలో జేసీఐ రాక్‌స్టార్ అధ్యక్షుడు కృష్ణసాహితీ, కోశాధికారి రవికిరణ్ రెడ్డి, ఉపాధ్యక్షులు రాజి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రథసప్తమి పూజలు


రంగంపేటలో చిక్కుడు కాయలతో తయారుచేసిన రథం


కోరుకొండలో పూజలందుకుంటున్న సూర్యభగవానుడు

రంగంపేట: మండలంలోని 17 గ్రామాల్లో ప్రజలు మంగళవారం భక్తిశ్రద్ధలతో రథసప్తమి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ స్వామికి ప్రత్యేక పూజలు చేసారు. మహిళలు ఏడు పిడకలపై వండిన వంటకాలను నైవేద్యంగా సమర్పించారు. చిక్కుడు కాయలు, పువ్వులతో రథాన్ని తయారుచేసి అందులో సూర్యనారాయణస్వామి చిత్రపటం పెట్టి లాగారు. లోక సంక్షేమం, ఆరోగ్య ప్రదాతగా స్వామిని పూజించి, పరస్పరం భక్తులకు ప్రసాదాలు పంచారు. రంగంపేట వెంకటేశ్వర స్వామి, వడిశలేరు భజేనారాయణస్వామి ఆలయాల్లో రథసప్తమి సందర్భంగా ప్రత్యేక పూజలు, భజనలు చేసారు.

ఆదిత్యుడికి ఘనంగా పూజలు

మధురపూడి: కోరుకొండ దేవుని కోనేరు సమీపంలోని సూర్య భగవానుడి ఆలయంలో మంగళవారం రథసప్తమి పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పండితుల మంత్రోచ్ఛరణ నడుమ ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. రథసప్తమిని పురస్కరించుకుని నిర్వాహకుడు ప్రభాకరం ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. ఏటా మాదిరిగానే స్వామివారికి ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఉదయం 5 గంటల నుంచి ఆలయానికి భక్తులతో రద్దీ ఏర్పడింది. ఈ సందర్భంగా భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. కోరుకొండ, శ్రీరంగపట్నం, కోటి, మునగాల, కాపవరం, పశ్చిమగానుగూడెం, తదితర గ్రామాలకు చెందిన భక్తులు స్వామివారి తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

ప్రభుత్వాసుపత్రిలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ


ప్రభుత్వాసుపత్రిలో వైద్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

కంబాలచెరువు: ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సమయపాలన ఖచ్చితంగా పాటించాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. స్థానిక ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిని కలెక్టర్ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేసారు. ఆసుపత్రిలోని జనరల్ వార్డు, పిల్లల వార్డులను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలకు దిగువ, మధ్య తరగతి ప్రజలు వైద్య సేవలు పొందేందుకు వస్తారని వారికి సత్వరం వైద్య సేవలు అందించేందుకు సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. దీనికి వైద్యాధికారులు, ఇతర అనుబంధ విభాగాల సిబ్బంది సమయ పాలన ఖచ్చితంగా పాటించాలన్నారు. జనరల్ వార్డు మెడిసిన్ విభాగంలో ఉదయం షిఫ్ట్‌లో విధులు నిర్వహించాల్సిన సిబ్బంది గైర్హాజరవడంతో హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. అనంతరం పిల్లల వైద్య సేవల విభాగాన్ని సందర్శించారు. జనరల్ మెడిసిన్ విభాగంలో ఇద్దరు సిబ్బంది గైర్హాజరుపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేసారు. ప్రభుత్వ ఆసుపత్రికి అనుసంధానంగా మెడికల్ కాలేజీ ఆధ్వర్యంలోని వైద్యులు సేవలు అందిస్తున్నారని, ఈ క్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌తో పాటు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ ఇరువురి అనుమతితో సెలవు తీసుకోవాలని సూచించారు. ఆసుపత్రి పర్యవేక్షణ అధికారిగా సూపరింటెండెంట్ కీలకంగా వ్యవహరించాల్సి ఉంటుందన్నారు. కలెక్టర్ వెంట ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యం .లక్ష్మీసూర్య ప్రభ, కేఆర్ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ డి.భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా అధ్యయనోత్సవాలు


వడిశలేరు భజేనారాయణస్వామి ఆలయంలో అధ్యయనోత్సవాలు తిలకిస్తున్న భక్తులు

రంగంపేట: వడిశలేరులో కొలువైయున్న శ్రీదేవి, భూదేవి సమేత భజేనారాయణస్వామి తిరుకల్యాణోత్సవాల్లో భాగంగా అధ్యయనోత్సవాలు చివరి రోజైన మంగళవారం ఘనంగా ముగిసాయి. నమ్మాళ్వార్ పరంపరోత్సవం సోమవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నమ్మాళ్వార్ ఉత్సవ మూర్తికి ఆలయ అర్చకుడు చిలకమర్రి మురళీకృష్ణమాచార్యులు, శ్రీనివాసాచార్యులు పుష్పాలు, తులసి దళాలతో ప్రత్యేక పూజలు చేసారు. మహిళలు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలను తిలకించారు. ముడుంబై రామానుజాచార్యులు, రేగడమిల్లి రాందేవ్‌శర్మ ఆధ్వర్యంలో ఐదు రోజులుగా నిర్వహించిన అధ్యయనోత్సవాలు ముగిసినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి ముమ్మన రాంబాబురెడ్డి, ఉత్సవ కమిటీ చైర్మన్ మల్లిరెడ్డి శ్రీనివాసులు తెలిపారు. ఈనెల 7 నుంచి 12వ తేదీ వరకు స్వామివారి తిరుకల్యాణోత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కల్యాణోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

ప్రమాదకర తుప్పల తొలగింపు


సుభద్రంపేట-ముకుందవరం రోడ్డులో ప్రమాదభరితంగా పెరిగిన తుప్పలు


తుప్పలు తొలగించిన తరువాత సుభద్రంపేట-ముకుందవరం రోడ్డు

సాక్షి ఇంపాక్ట్

రంగంపేట: రోడ్డుకు ఇరువైపులా ప్రమాదకరంగా ఉన్న తుప్పలను అధికారులు తొలగించారు. మండల పరిధిలోని సుభద్రంపేట-ముకుందవరం గ్రామాల మధ్య జి.దొంతమూరు వెళ్లే దారిలో రోడ్డుకిరువైపులా తుప్పలు దట్టంగా పెరిగిపోయాయి. ఆ దారిలో ప్రయాణించే వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతుండడంతో ఇటీవల రోడ్డుకిరువైపులా ప్రమాదకరంగా తుప్పలు అనే శీర్షికన సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన ఎంపీడీఓ వీరసాయిబాబు, ఈవోపీఆర్డీ పి. వెంకటరత్నం సంబంధిత పంచాయతీ అధికారులకు తుప్పలు తొలగించాలని ఆదేశించారు.దీంతో పారిశుద్ధ్య సిబ్బందితో తుప్పలను తొలగించారు. దీంతో రెండు గ్రామాల ప్రజలు, వాహనచోదకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

లలితేశ్వరి హత్య కేసులో మహిళ అరెస్టు

బిక్కవోలు: పందలపాకలో జరిగిన లలితేశ్వరి హత్య కేసులో మహిళను అరెస్టు చేసినట్లు అనపర్తి సీఐ సుమంత్ మంగళవారం తెలిపారు. ఆ గ్రామంలో గత నెల 29వ తేదీన కుడుపూడి లలితేశ్వరి అనే వివాహిత హత్యకు గురైన విషయం తెలిసిందే. ఆ ఘాతుకానికి పాల్పడిన గుత్తికోలు దుర్గాప్రసాద్‌ను గత నెల 31న అరెస్టు చేశారు. అతడికి సహకరించిన తల్లి గుత్తికోలు వరలక్ష్మిని మంగళవారం బిక్కవోలు బస్ స్టేషన్ వద్ద అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఘనంగా భావనారుషి కల్యాణం

బిక్కవోలు: పందలపాక గ్రామంలో కొలువై ఉన్న భద్రావతి సమేత భావనారుషి స్వామి కల్యాణం మంగళవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కల్యాణానికి కల్యాణకర్తలుగా గ్రామానికి చెందిన సప్పా శ్రీను, మంగరత్నం దంపతులు వ్యవహరించారు. అర్చకులు కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు విశేషంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు చింతలపూడి చిన్ని, పసగడుగుల వీర్రాజు, శీరం దుర్గాప్రసాద్, జక్కా శ్రీను పాల్గొన్నారు.

చర్చలు లేకుండా ముగిసిన సర్వసభ్య సమావేశం

కడియం: ఎన్నికల కోడ్ కారణంగా కడియం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశం మంగళవారం ఎలాంటి చర్చ లేకుండా ముగించారు. ఎంపీడీవో కె.రమేష్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎలాంటి చర్చలు చేయకుండానే ఈ సమావేశాన్ని వాయిదా వేశారు.ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ పంతం గణపతి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పాఠశాల రికార్డుల నిర్వహణపై శ్రద్ధ చూపాలి

కంబాలచెరువు: పాఠశాల రికార్డుల సక్రమంగా నిర్వహించడంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని అర్బన్ రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ బి.దిలీప్ కుమార్ ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. స్థానిక జాంపేటలోని నగరపాలక సంస్థ ప్రాథమిక పాఠశాలను ఆయన మంగళవారం సందర్శించారు. జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం నగరంలోని అన్ని పాఠశాలల్లో రోలు, అడ్మిషన్ల వివరాలను ప్రత్యేక బృందాలు తనిఖీ చేస్తున్నాయన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు తమ తరగతి విద్యార్థుల రోలు, హాజరుపై అత్యంత జాగ్రత్త వహించాలన్నారు. వరుసగా మూడు రోజులు బడికి రాని విద్యార్థి ఇంటికి వెళ్లి వివరాలు సేకరించి ఆ చిన్నారిని పాఠశాలకు తీసుకువచ్చేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. పాఠశాలకు హాజరు కాని విద్యార్థుల వివరాలను ఆన్‌లైన్‌లో డ్రాప్‌బాక్స్‌లో ఉంచాలన్నారు. 2024, 25 సంవత్సరానికి సంబంధించిన బేస్‌లైన్, మిడ్ లైన్ టెస్ట్‌లను అన్ని పాఠశాలల్లో నిర్వహించినట్లు తెలిపారు. విద్యా సంవత్సరం చివరిలో నిర్వహించే ఎండ్ లైన్ పరీక్షకు విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మెరుగుపర్చాలన్నారు.